
సామర్లకోట మాండవ్యనారాయణస్వామి ఆలయంలో పంచాగ శ్రవణం


నాట్య శిక్షణ ప్రారంభించిన ఈఓ నాగమల్లేశ్వరరావు, దవులూరి సుబ్బారావు


సామర్లకోట పంచారామ క్షేత్రంలో ప్రారంభమైన వసంత నవరాత్రి ఉత్సవాలు


నూకాలమ్మ తల్లిని దర్శించుకున్న భక్తులు


గోర్సలో ఉమ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న పండితులు

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిఠాపురం: మండలంలో విరవాడ, ఎల్ఎన్ పురం గ్రామాలకు గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్టు విద్యుత్ శాఖ ఈఈ జి.ప్రసాద్ తెలిపారు. విరవాడ గ్రామంలో 11 కేవీ మల్లాం ఫీడర్‌పై విద్యుత్ లైన్ల మరమ్మతులు, మల్లాం కొత్త సబ్‌స్టేషన్ పనుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

కోడి పందేలపై దాడి

- 9 మంది అరెస్టు, రూ.11,200 స్వాధీనం

సామర్లకోట: మండల పరిధి జి.మేడపాడులో నిర్వహిస్తున్న కోడి పందాల శిబిరంపై పోలీసులు బుధవారం దాడి చేశారు. ఈ మేరకు తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని రూ.11,200, రెండు కోళ్లు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ కె.దుర్గాప్రసాద్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దవులూరిని కలసిన జాషువా గిరి


దవులూరితో జాషువాగిరి

సామర్లకోట: వైఎస్సార్ సీపీ తూర్పుగోదావరి జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు దడాల జాషువాగిరి బుధవారం రాత్రి రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబును కలిసారు. ఈ సందర్భంగా గిరిని దవులూరి సన్మానించారు. మున్సిపల్ క్రిస్టియన్ కో ఆప్షన్ సభ్యుడు సల్లూరి కల్యాణ్, మండల పాస్టర్ల సంఘ అధ్యక్షుడు పోలిమాటి ఆనంద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అరుణాచల క్షేత్రంలో కామధేను మహా యజ్ఞం

ప్రత్తిపాడు రూరల్: రాచపల్లి శ్రీరమణా సేవా ఆశ్రమంలోని అరుణాచల క్షేత్రంలో కామధేను మహా యజ్ఞాన్ని నిర్వహించారు. లక్షా ఎనిమిది వేల గోవు పిడకలు, 250 కేజీల ఆవు నెయ్యి, ఒక టన్ను సమ్మెదెలు, సుగంధ ద్రవ్యాలతో ఈ మహా యజ్ఞానాన్ని 108 మంది వేద పండితులతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అఖిల భారత హిందూ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీఆర్ శాస్త్రి చేతుల మీదుగా కామధేను మహా యజ్ఞాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అపిత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భారీ ఎత్తున తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. దీంతో ఆలయ ప్రాంగాణంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఆశ్రమ పీఠాధిపతి రమణస్వామి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా గంటాలమ్మ తీర్థం

కరప: స్థానిక పల్లపువీధి గ్రామ దేవత గంటాలమ్మ తీర్థం బుధవారం ఘనంగా జరిగింది. వేద పండితుడు ముత్యం ప్రసాదరావు ఆధ్వర్యంలో కొక్కిరిగడ్డ సుబ్రహ్మణ్యం బృందం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి లక్ష పసుపుకొమ్ముల పూజ, హోమం నిర్వహించారు. ఆలయకమిటీ సభ్యులు వుయ్యూరి రామచంద్రరావు, పెద్దాడి సత్తిరాజు, చీకల వెంకటరమణ తదితర ఆలయ కమిటీ సభ్యులు, సాయిమందిర్, షిరిడీయూత్ సభ్యులు, వీధి పెద్దలు భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. పరిసర గ్రామాల భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అంతా శోభకృతమే...!

- ఘనంగా ఉగాది వేడుకలు
- పోటెత్తిన భక్తులు
- కిటకిటలాడిన దేవాలయాలు
- కళకళలాడిన గ్రామాలు


పాదగయ క్షేత్రంలో పంచాంగ పఠనం చేస్తున్న వేద పండితులు


దుర్గాడ రామలింగేశ్వర స్వామి వారు

పిఠాపురం: శుభకృత్ తెలుగు సంవత్సరాది ఉత్సవాలు బుధవారం పిఠాపురం నియోజకవర్గంలో వాడవాడలా అంబరాన్నంటాయి. అన్ని గ్రామాల్లోను ప్రతి ఒక్కరు సాంప్రదాయ వస్త్రధారణలో కనిపించడంతో తెలుగు దనం ఉట్టిపడింది. తెల్లవారుజాము నుంచి వివిధ గ్రామాల్లో ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు దర్శనాలకు బారులుతీరారు. ప్రతి ఇంట ఉగాది పచ్చడి తయారు చేసుకుని బంధుమిత్ర సపరివారంగా పచ్చడి సేవించారు. శోభకృత్ నామ తెలుగు సంవత్సరాదిలో పిఠాపురం పాదగయ క్షేత్రంలో ఉగాది సందర్భంగా వేద పండితులు ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం జరిగింది. ఈ ఏడాది అందరికీ శుభాలు కలుగుతాయని అంతా సస్య శ్యామలంగా ఉంటుందని పేరుకు తగ్గట్టుగా అంతా శోభకృతంగా ఉంటుదని, వర్షాలు అధికంగా కురుస్తాయని, పాడి పరిశ్రమ, రైతులకు మంచి మేలు జరుగుతుందంటూ పంచాంగ శ్రవణంలో పండితులు తెలిపారు. పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, పాదగయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు అర్చకులు పాల్గొన్నారు. పిఠాపురంలో కుంతీమాధవస్వామి, గణేష్, శ్రీపాద వల్లభ మహా సంస్థానం, వేణుగోపాల స్వామి ఆలయం తదితర ఆలయాల్లో ఉగాది సంబరాలు కనుల పండువగా నిర్వహించారు. పలు దేవాలయాల వద్ద విసెన కర్రలు, ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. వివిధ గ్రామాల్లో రైతులు ఏరువాక సాగారు. గొల్లప్రోలు మండలం దుర్గాడ రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించగా స్వామివారు ప్రత్యేకాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

భక్తిశ్రద్ధలతో వసంత నవరాత్రి ఉత్సవాలు

సామర్లకోట: స్థానిక బాలత్రిపుర సందరి సమేత కుమార రామభీమేశ్వరస్వామి ఆలయంలో బుధవారం నుంచి వసంత నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు. ఉగాది సందర్భంగా ఏటా ఆలయంలో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అమ్మవారి ఆలయంలో కలశస్థాపన చేసి పూజలు ప్రారంభించారు. ఆలయంలో నంది మండపం వద్ద స్వామి, అమ్మవార్ల విగ్రహలకు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి రుద్రాభిషేకం చేశారు. తొమ్మిది రోజులూ సాయంత్రం నీరాజన మంత్రపుష్పాలు, దర్బారు సేవ, ఆశీర్వచనాలు ఉంటాయని ఆలయ అభిషేక పండితులు వేమూరి సోమేశ్వరశర్మ తెలిపారు. ఏప్రిల్ ఒకటిన ఉత్సవ విగ్రహలను సింహ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించనున్నట్టు ఈఓ డి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. ఈఓతో పాటు, ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు, ట్రస్టు బోర్డు సభ్యులు యండమూరి వెంకటసుబ్బారావు, కర్రి వెంకటలక్ష్మి, నాతిపాముల సూరిబాబు, మానవ హక్కుల సంఘ జిల్లా అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండలు పాల్గొన్నారు. పూజల అనంతరం ప్రసాద వితరణ జరిగింది.

ఉచిత నాట్య శిక్షణ ప్రారంభం

పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వరస్వామి ఆలయంలో ఉగాది పర్వదినం సందర్భంగా ఉచిత నాట్య శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. బాలికలకు కూచిపూడి నాట్యం, బాలురకు పేరిణీ శివతాండవాల్లో నాట్య గురువు బేతా సత్యనారాయణ శిక్షణ ఇస్తున్నారు. దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, ఈఓ డి నాగమల్లేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణను ప్రారంభించారు. శిక్షణ ప్రతి ఆదివారం సాయంత్ర 4 గంటల నుంచి ఆరు గంటల వరకు ఉంటుందని ఈఓ తెలిపారు. 10 నుంచి 16 ఏళ్లలోపు బాల బాలికలకు మాత్రమే శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ట్రస్టు బోర్డు సభ్యులు యండమూరి వెంకట్రావు, నాతిపాముల సూరిబాబు, బీవీ రమణ, ఇరుసుమళ్ల సాయి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

స్థానిక స్టేషన్ సెంటర్‌లోని షిర్డీ సాయి ఆలయంలో బుధవారం సాయంత్రం చిన్నారుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఆంధ్రాసాయిగీతా సమాజం ఆధ్వర్యంలో భక్తి గీతాల నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ నాయకులు గంధ్రోల సత్యనారాయణ, డి.అప్పారావు, డి రాజబాబు సేవలందించారు.

ఉత్సాహంగా పంచాంగ పఠనాలు


పంచారామ క్షేత్రం బాలత్రిపురసుందరి సమేత కుమార రామభీమేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ఘనపాఠి వేమూరి సోమేశ్వరశర్మ పంచాగ పఠనం చేసి భక్తులకు రాశి ఫలాలు వివరించారు. దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ట్రస్టు బోర్డు సభ్యులు పాల్గొన్నారు. అతి పురాతన మాండవ్యనారాయణ స్వామి ఆలయంలో రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కంటే బాబు, యార్లగడ్డ బాపినీడుల ఆధ్వర్యంలో పంచాగ పఠనం జరిగింది. పండితులు చోనాల సురేష్‌శర్మ, సీహెచ్ హనుమశాస్త్రి వార్షిక ఫలితాలను వివరించారు. అనంతరం రైతు సంఘ సర్వసభ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీ ఎన్నిక జరిగింది. స్థానిక కనక మహలక్ష్మి ఆలయంలోను పంచాగ పఠనం జరిగింది.

ఘనంగా ఉగాది వేడుకలు

కొత్తపల్లి: మండలంలో ఉగాది పండగ బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, బాలాత్రిపుర సుందరి సమేత రాజశేఖర స్వామి, ధర్మశాస్త్రా, ఉప్పాడలోని మత్స్యలింగేశ్వర స్వామి, వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలను, అభిషేకాలు నిర్వహించారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

సామర్లకోట: ఉగాది పర్వదినం సందర్భంగా స్థానిక నూకాలమ్మ తల్లిని బుధవారం రాత్రి వరకు భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి కోడి, చీరల మొక్కు తీర్చుకున్నారు. భక్తులకు ఈదల ఈశ్వరకుమార్, కర్రి ఆదినారాయణరెడ్డి, ఎం పెద్దకాపు, బొమ్మాలరావు తదితరులు సేవలందించారు



పాదగయ క్షేత్రంలో ప్రత్యేక పూజలు

పిఠాపురం: శోభకృత్ తెలుగు సంవత్సరాది ఉత్సవాలు బుధవారం పిఠాపురం పాదగయ క్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకం, అమ్మవార్లకు కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణలలో స్వామి అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు.


ప్రత్యేక అలంకరణలో పూరుహూతికా అమ్మవారు

ఎన్నికల్లో మద్దతు ఇవ్వండి

- పలువురు నాయకులకు దవులూరి దొరబాబు విజ్ఞప్తి


మన్యం చంద్రరావును కలసిన దొరబాబు

సామర్లకోట: నియోజకవర్గ పరిధిలో వివిధ రాజకీయ పార్టీ నాయకులను రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు బుధవారం కలుసుకున్నారు. నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా శాసనసభ ఎన్నికల్లో పోటీ చేయడానికి అనుమతి లభించడంతో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త మన్యం చంద్రరావు, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ గుణ్ణం రాజబ్బాయి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముత్యాల రాజబ్బాయి, పారిశ్రామిక వేత్త గోలి కోటేశ్వరరావులను కలిసి ఎన్నికలల్లో తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఆయన వెంట ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్లు ఊబా జాన్ మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్, సొసైటీ అధ్యక్షులు మేకా శ్రీనివాసరావు, వీరంరెడ్డి నాని, పట్టణ పార్టీ అధ్యక్షుడు మద్దాల శ్రీను దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జూదం, కోడి పందేలపై పోలీసుల దాడులు

17 మంది అరెస్టు, రూ.6,700 స్వాధీనం

జగ్గంపేట: మండలంలోని పలు గ్రామాలలో కోడి పందేలు, జూదం ఆడుతున్న ప్రాంతాలపై జగ్గంపేట పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడులలో 17మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.6,700 స్వాధీనం చేసుకున్నట్లు జగ్గంపేట ఎస్సై విద్యాసాగర్ తెలిపారు. మండలంలోని రామవరం గ్రామ శివార్లలో కోడి పందేలు ఆడుతున్న ఐదుగురిని, కాట్రావులపల్లి గ్రామ శివారులో కోడిపందేలు ఆడుతున్న ఎనిమిది మందిని, పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేశామని తెలిపారు. వీరిని గురువారం కోర్టుకు తరలిస్తామని వివరించారు.

కళాకారుల సంక్షేమానికి సహకారం

- రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి


కార్యక్రమంలో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు

సామర్లకోట: కళాకారులకు తన వంతు సహకారం ఉంటుందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. సకల కళాసమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం రాత్రి స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గతంలో సామర్లకోటలో రాష్ట్ర స్థాయి నాటిక పోటీలో నిర్వహించడానికి నాటక పరిషత్ ఉండేదని, తిరిగి నాటక పరిషత్ ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. సకల కళా సమాఖ్య ఆధ్వర్యంలో వివిధ రంగాలోని కళాకారులను ఒకే వేదిక మీదకు తీసుకురావడం అభినందనీయమన్నారు. పట్టణంలో ఎంతో మంది కళాకారులు ఉన్నారని వారిని వెలుగులోనికి తీసుకురావడానికి సమాఖ్య కృషి చేయాలన్నారు. పట్టణంలో కళావేదిక ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలను చైతన్యవంతులను చేసేలా ప్రదర్శనలు ఉండాలని అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ మాట్లాడుతూ కళాకారుల వేదిక కోసం మున్సిపాలిటీలో స్థలం సేకరించి ఇచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సీనియర్ కళాకారుడు, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు మాట్లాడుతూ యువత ముందుకు వచ్చి సకల కళా సమాఖ్య ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు ఊబా జాన్ మోజెస్, గోకిన సునేత్రా దేవి, సకల కళాసమాఖ్య అధ్యక్షుడు బడుగు బాబీ, సినీ దర్శకుడు కేబీ ఆనంద్, సొసైటీ అధ్యక్షుడు మేకా శ్రీనివాసు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఉగాది సందర్భంగా కూచిపూడి, ఏకపాత్రాభినయం, దేశభక్తి గీతాలు నాటిక ప్రదర్శనల్లో విజేతలకు ముఖ్య అతిథులు బహుమతులు అందజేశారు.

మానవత్వంతో దైవత్వాన్ని పొందవచ్చు


చలివేంద్రం ప్రారంభిస్తున్న ఉమర్ ఆలీషా న్యాయమూర్తి సుధారాణి


పేద మహిళలకు కుట్టు మెషీన్లు అందజేస్తున్న ఉమర్ ఆలీషా

- డాక్టర్ ఉమర్ ఆలీషా

పిఠాపురం: మానవుడు తనలో ఉన్న మానవత్వాన్ని పెంచుకోవడం ద్వారా దైవత్వాన్ని పొందుతాడని విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలు బుధవారం పీఠం ఆవరణలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమర్ ఆలీసా భక్తులకు అనుగ్రహ బాషణ చేశారు. దుష్టత్వం ద్వారా రాక్షసత్వాన్ని మంచి పనుల ద్వారా మానవత్వాన్ని మానవుడు పొందుతాడని అందుచేత మానవత్వాన్ని పెంచుకునేలా మానవుడు నిరంతరం కృషి చేయాలని కోరారు. అంతరించిపోతున్న మానవత్వ విలువలు పెంపొందించుకోవాలంటే ముందుగా కామ క్రోద, లోభ, మోహ, మద, మత్సర్యాల రూపంలో తనలో ఇమిడి ఉన్న అరిషడ్వర్గాలను స్థాయి పరచుకోవాలన్నారు. అనంతరం వేసవిని దృష్టిలో ఉంచుకుని నూతన ఆశ్రమ ప్రధాన ద్వారం వద్ద చలివేంద్రాన్న ఆయన ప్రారంభించారు. పీఠంలో సేవలందిస్తున్న 45 మంది మహిళలకు న్యాయమూర్తి సుధారాణితో కలిసి సత్కరించారు. ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ద్వారా పలువురు మహిళలకు కుట్టు మెషీన్లు, చీరలు అందజేశారు.

వర్షంతో చెరువుగా మారిన పిఠాపురం


జలమయమైన పిఠాపురం ప్రభుత్వాసుపత్రి ప్రాంగణం


కురుస్తున్న వర్షం

పిఠాపురం: పట్టణంలో బుధవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి చెరువులా మారింది. ఎడతెరపిలేని వర్షంతో మెయిన్ రోడ్డుతో పాటు వివిధ ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రభుత్వాసుపత్రి ప్రాంగణం జలమయమవ్వగా మెయిన్‌రోడ్డు నీటితో నిండిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు వార్డుల్లో రోడ్లు వర్షపు నీటితో నిండిపోవడంతో స్థానికులు బయటకు వచ్చే అవకాశం లేకుండా పోయింది.

కొత్తపల్లి మండలంలో భారీ వర్షం

కొత్తపల్లి: మండలంలో బుధవారం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలు ప్రాంతాల్లో ప్రధాన రహదారులు చెరువులను తలపించాయి. పిఠాపురం– ఉప్పాడ రోడ్డులో కొత్తపల్లి పోలీస్ స్టేషన్ వద్ద, ఉప్పాడ బీచ్‌రోడ్డ సెంటర్‌లో ఇరువైపులా ఉన్న డ్రైన్ ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో నీరు నిలిచిపోతోంది. దీంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడంలేదు.

కర్షకుల కలెక్షన్ సెంటర్లు

- రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటుకు ప్రభుత్వ తోడ్పాటు
- పండించిన పంటలకు పటిష్ట భద్రత
- వేగంగా కలెక్షన్ సెంటర్ల నిర్మాణాలు


గొల్లప్రోలు మండలం చెందుర్తిలో నిర్మాణ దశలో ఉన్న రైతు ఉత్పత్తిదారుల సంఘం కలెక్షన్ సెంటర్

పిఠాపురం: మార్కెట్‌లో కిలో టమాట రూ.100 కానీ రైతు దగ్గర మాత్రం కిలో రూ.10 మాత్రమే. అలాగని వ్యాపారులను ఎక్కువ రేటు అడిగినా ఇవ్వరు.. వేరే చోట అమ్ముకుందామన్నా అవకాశం ఉండదు. దీంతో రైతు దళారి అడిగిన రేటుకు పంట ఇచ్చి నష్టం చవిచూడాల్సిందే. తక్కువకు అడుగుతున్నారు కదా అని రెండు రోజులు ఆగి అమ్ముకుందామన్నా రేటు ఎక్కువ వచ్చే ప్రాంతానికి తీసుకెళదామన్నా వీలు లేక పోగా పంట పాడైపోతుంది అప్పుడు మొత్తం నష్టమే మిగులుతుంది. అందుకే రైతులు దళారులతో ప్రమేయం లేకుండా వారి పంటను వారే రేటు ఎక్కువ వచ్చే ప్రాంతంలో అమ్ముకోడానికి బృహత్తర కార్యక్రమం రూపొందించి, దున్నే వాడిదే భూమి అన్నట్టుగా పండించిన వారిదే లాభం అనే పిలుపుతో ఈ కార్యక్రమం అమలు చేస్తోంది ప్రభుత్వం. ఇప్పటి వరకు కొబ్బరి ఆధారిత ఉత్పత్తులకు మాత్రమే ఉన్న ఈ సంఘాలను ప్రస్తుతం ఉద్యానవన ఉత్పత్తులకు విస్తరించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. కలెక్షన్ సెంటర్లు ఏర్పాటు చేస్తోంది. అది ఒక కంపెనీ దానికి ఒక సీఈఓ, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్, ఒక కార్యాలయం, వ్యాపార లావాదేవీలు జరుగుతుంటాయి అలాగని అక్కడ ఉండేది పని చేసేది ఉద్యోగులు కాదు.. కార్మికులు అసలే కాదు.. వారంతా కర్షకులు. ఇదేంటి రైతులు కంపెనీ నడపడమేమి అనుకుంటున్నారా అవును ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక నష్టాల పాలవుతున్న రైతులకు అండగా నివాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. ఇప్పటికే మరిన్ని ఏర్పాటు చేయడానికి అధికారులు రైతుల్లో అవగాహన కల్పిస్తున్నారు. పండించిన పంటలకు పటిష్ట భద్రత కల్పించుకోవడం, గిట్టుబాటు ధరలు సాధించే అవకాశాలు మెరుగుపర్చడం, నష్టాలను నివారించుకునే సౌలభ్యం కల్పించడమే ధ్యేయంగా ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ (ఎఫ్ పీ ఓ)లను ఏర్పాటు చేసుకునేందుకు రైతులకు ప్రభుత్వం అండగా ఉండనుంది.

కంపెనీ ఏర్పాటు ఇలా

11 మంది నుంచి 300 మంది రైతుల వరకు కలిసి ఒక సంఘంగా ఏర్పడాలి. అందరు ఏకమై సమావేశం నిర్వహించుకుని 5 నుంచి 15 మందిని సంఘం మెంబర్లుగా ఎన్నుకోవాలి. వారు, ఆ సంఘానికి ఒక సీఈఓను అందరి ఆమోదంతో ఎన్నుకుంటారు. అలా ఏర్పాటైన సంఘంలో సభ్యులందరు ఒక్కొక్కరు రూ.1000 చొప్పున షేరు దనం చెల్లించి బోర్డ్ ఆఫ్ మెంబర్స్ స్థానిక బ్యాంకులో జాయింట్ అకౌంట్ తెరచి, ఆ అకౌంటులో వేయాలి. దానితో పాటు ప్రభుత్వం ఇచ్చే సొమ్ముతో కలిపి కంపెనీ లావాదేవీలు కొనసాగించాలి.

ప్రభుత్వ తోడ్పాటు ఇలా

ఉత్పత్తుల సేకరణ కేంద్రం, కోల్డ్ స్టోరేజ్ నిర్మాణానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేస్తుంది. 60 ఇన్‌టూ 40 అడుగుల వ్యాసార్థంలో గొడౌన్ నిర్మించుకోవాలి. దీని కోసం సభ్యులలో ఒకరికి చెందిన 10 సెంట్ల భూమిని కనీసం ఎనిమిదేళ్లకు లీజుకు తీసుకోవాలి. ఆ భూమిలో ఉత్పత్తుల సేకరణ కేంద్రం, స్టోరేజ్ నిర్మాణాలు చేపట్టాలి. కోల్డ్ స్టోరేజ్ నిర్మాణానికి రూ.12 లక్షలు ఖర్చు కాగా దానిలో 75 శాతం ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుంది. ఉత్పత్తుల సేకరణ కేంద్రానికి రూ.15 లక్షల ఖర్చు అవుతుండగా దానిలో 75 శాతం సబ్సిడీ వస్తుంది. సంఘానికి వీటి నిర్మాణానికి పెట్టుబడి లేకపోతే 90 శాతం బ్యాంకు రుణం పొందే వెసులుబాటు కూడా కల్పించారు.

కంపెనీ నడిచేది ఇలా

రైతులు తమ పొలాల్లో పండించే పంటను అంతా ఇక్కడకు చేర్చుకుని గిట్టుబాటు ధర వచ్చే వరకు నిల్వ చేసుకోవచ్చు, ధర ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు ఎగుమతి చేసుకుని నష్టాలు రాకుండా చూసుకోవచ్చు. ముఖ్యంగా దళారుల అవసరం లేకుండా నేరుగా వ్యాపారులే ఇక్కడకు వచ్చి కొనుగోలు చేసుకునేలా ఒప్పందాలు చేసుకుంటారు. విత్తనాలు ఎరువులు, పురుగు మందులు తదితర వాటిని నకిలీలకు తావు లేకుండా నాణ్యమైనవి కొనుగోలు చేసుకోవచ్చు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

హరితవన రైతు ఉత్పత్తిదారుల సంఘంతో రైతులకు మేలు జరుగుతుంది. హరితవన రైతు ఉత్పత్తిదారుల సంఘం వల్ల రైతులు తమ పంటలను నిల్వ చేసుకుని, తగిన రేటు వచ్చిన తరువాత అమ్ముకోవడం ద్వారా నష్టాలు లేకుండా లాభాలు పొందవచ్చు. ఎవరికి వారే తమ పంటలను నేరుగా అమ్ముకోవడానికి ఈసెంటర్లు ఎంతగానో ఉపయోగపడతాయి. పిఠాపురం నియోజకవర్గంలో గొల్లప్రోలు మండలం చెందుర్తిలో ఒకటి, తాటిపర్తిలో ఒకటి, పిఠాపురం అగ్రహారంలో ఒకటి కలెక్షన్ సెంటర్లు నిర్మాణ దశలో ఉన్నాయి. – పి.అరుణ్‌కుమార్, పిఠాపురం ఉద్యాన శాఖాధికారి ఇన్‌చార్జి

రహదారుల ఆధునీకరణకు ప్రాధాన్యత

- మంత్రి దాడిశెట్టి రాజా, పాల్గొన్న ఎంపీ వంగా గీత
- రూ.18కోట్ల పనులకు శిలాఫలకం ఆవిష్కరణ


ఎస్.అన్నవరంలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా, ఎంపీ వంగా గీత

తుని రూరల్: రహదారుల ఆధునీకరణకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని రోడ్లు భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా పేర్కొన్నారు. తుని నుంచి ఎస్.అన్నవరం, తొండంగి మండలం పైడికొండ వరకూ 9.70 కిలో మీటర్ల రహదారి ఆధునీకరణకు రూ.18కోట్లతో చేపట్టనున్న పనులకు కాకినాడ ఎంపీ వంగా గీతతో కలసి మంత్రి శిలాఫలకాన్ని బుధవారం ఆవిష్కరించారు. అంతకు ముందు తన కార్యాలయంలో దాడిశెట్టి రాజా విలేకర్లతో మాట్లాడారు. రహదారుల నిర్మాణం, ఆధునీకరణ పనులు నిరంతరం కొనసాగే ప్రక్రియన్నారు. ప్రధాన రహదారులతో పాటు మండల కేంద్రాలకు అనుసంధానంగా ఉన్న ఆర్అండ్‌బీ రోడ్లను అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. కార్యకర్తలు, నాయకులు, అభిమానులు మంత్రి రాజాను కలసి జన్మదిన, తెలుగు సంవత్సరాది ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. పెరిక కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ పురుషోత్తం గంగాభవానీ, మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, లోవ దేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, మున్సిపల్ చైర్మన్ ఏలూరి సుధారాణి, ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, జెడ్పీటీసీ పోతల సూర్యమణి, పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకట్రావు, డీసీసీబీ డైరెక్టర్ పోలిశెట్టి సోమరాజు, ఆర్ అండ్ బీ డీఈ అంబటి ప్రకాశరావు పాల్గొన్నారు.